# బొమ్మలో భామ ★

రచన :
"మధుమూర్తి"

"నువ్వు ఎవరిని లెక్క చేస్తానంటావ్?" అడిగింది అద్దం-

"సంఘాన్ని" అంది విమల.

అద్దానికి నిజంగా కోపంవచ్చింది. అస్తమిస్తున్న సూర్యకిరణాలను అద్దెకు పుచ్చుకుని కోపాన్ని ప్రదర్శించింది తన ముఖంలో.

విమల ఏమీ భయపడలేదు. సమాధానంకోసమే ఎదురు చూస్తోంది.

"సంఘం అంటే నీ దృష్టిలో ఎవరు?"

"ఊరంతా ఒక సంఘం; పల్లెఅంతా ఒక సమాజం. వీధుల్లో తిరిగేవారంతా ఒక బృందం. వీరంతా సంఘీయులే!" అంది విమల.

అద్దం విరగబడి నవ్వింది. విమలకు కోపం వచ్చింది. తను తెచ్చుకున్న ఎర్రటి కిరణాల్ని కొన్నింటిని విమలకు అప్పిచ్చింది అద్దం. కృతజ్ఞతతో విమల మౌనం వహించింది అందుకు.

"అక్కడే పొరబడుతున్నావ్ విమలా! బొందెలో ప్రాణం ఉన్న ప్రతీవాణ్ణి సంఘీయుడనుకొని వాడికి భయపడ్డం వట్టి అజ్ఞానంకాని మరోవాటి కాదు. అదీగాక నిసలైన సత్యం మరొకటి ఉంది. సంఘం అన్న దానిని ఎవ్వరూ నిర్మించలేదు. అది అదంతట అదేపుట్టింది. దీనిపుట్టుకకు సరియైన ఉదాహరణ టెస్ట్‌ట్యూబ్ బేబీ. యుగాలనాటినుంచి వచ్చే ఆచారం ఒకటి ఉందనీ, దానిని అతిక్రమిస్తే అందరికీ కోపంవస్తుందనీ నువ్వు అనుకొని ఆ అందరూ అనే బృందానికి సంఘంఅని పేరు పెట్టుకున్నావ్. నువ్వు సృష్టించుకున్న దానికి నువ్వే భయపడి లోబడతావ్. అక్కడే నీఅబలత్వం కనిపిస్తుంది. నీఅశక్తత అక్కడే ప్రదర్శితమౌతుంది. నిజానికి నీకు వున్న స్వేచ్ఛ ఎవరికి ఉంది?"

"ఎక్కడుంది నాకు స్వేచ్ఛ? ఈ ఇంట్లోనుంచి బైట కాలుపెట్టనివ్వరు. మూలకూచొని మ్రగ్గమంటారు. అమ్మా నాన్నా నీవు చెప్పిన కబుర్లు చెపితే చీపురుకట్ట పుచ్చుకుంటారు" అంది విమల.

అద్దం గట్టిగా నవ్వింది. ఐతే అనవ్వు నాలుగుచట్రాల బైటికిపోలేదు. "నీజీవితంఅంతా క్రొవ్వొత్తిలా కాలిపోవాలంటావా?"

"అనను- నాకూ సుఖం కావాలి?"

"మరి ఆకారమూ ఆవరణాలేని అదృశ్యమైన సంఘానికి గజగజలాడతావెందుకు?"

"మరి నా భయాన్ని తీర్చగలవారున్నారా?"

"ఆ సంగతి నువ్వే ఆలోచించు కొంచెం దీర్ఘంగా."

"ఉన్నారనే అనుకుంటున్నా."

"ఐతే నీ సంఘాన్ని ధిక్కరించేవాళ్లున్నారనే ధైర్యం వుందా?"

"ఆఁ వుండొచ్చు."

"వాళ్లే అసలయిన సంఘీయులు. దేశంలోని ప్రజలు అనవసరంగా కొన్ని మూఢ నమ్మకాలకు దాసోహం చేయకుండా చూసేవారే యథార్థమైన సంఘ సభ్యులు. దేశీయులను అథఃపాతాళానికి లొంగదీసేవారిని సంఘం అని పిలవకూడదు. వారు విధ్వంసకులు. నీ దృష్టిలో అది విధ్వంసక సంఘం. దానికే భయపడకు అంటున్నా."

అద్దం మాటలు విమల కళ్లను బాగా తెరచాయి. ఇంక మార్గాన్ని అన్వేషించడంలో ఆమె ములిగింది. అద్దం అదంతట అదే విమలను పలకరించడం మానేసింది. వెనుకనుంచి ఆమెను ముందుకు నడవమని ప్రోత్సహిస్తోంది. ఈ నైతిక సహాయాన్ని, నైతిక ధైర్యాన్ని అందిచ్చిన అద్దాన్ని విమల అభినందించింది.

తన స్థితిని ఓసారి పరిశీలించుకుంది కాపురం. ఏడాది నడవకుండానే భర్త చనిపోయాడు. తనకింకా యవ్వనం భౌతికంగా దాటలేదు కాని భర్త పోయిన పదకొండో రోజునుంచే తన ముత్తవ్వ స్థితిని పొందాననుకుంటోంది. తల్లి-తండ్రి తనకుచేసిన మేలుఒకటే. వికృతరూపాన్ని ప్రసాదించలేదు. అందుకే చాటుగా మాటుగా ఒక్కొక్కసారి తన శరీరాన్ని అద్దంలో చూసుకుంటోంది.

తను ఉన్న పల్లెలోనికి సంస్కరణ పేరుకి వినబడుతున్నా హృదయాల్లో కనబడటంలేదు. అదే పెద్దచిక్కు. నీతికి సంబంధించిన సంస్కరణలకు భయపడకుండా వుండగలిగేశక్తి మనలో ఇంకా రాలేదు. విధవా వివాహం అంటే "అబ్బో! అమ్మో! అవినీతి అపచారం"అని లెంపలు వాయించుకునే మానసిక తత్వాలు కనిపిస్తూనే ఉన్నాయి.

విమలకు పునర్వివాహంచేస్తే కూతురు వ్యభిచారిణులలో జమ అవుతుందని భయపడ్డారు, తలిదండ్రులు. ఐతే సుఖానికి ప్రధానమైన యవ్వనశక్తి నశించిన ముదివగ్గు పెళ్ళిచేసుకుంటే దానిని ఘాంతకుల చర్యక్రింద ఎందుకు జమకట్టకూడదూ?

ఇవేమీ ఆ పల్లీయులకు అవసరం లేదు. "ఖర్మం కాలిపోయినప్పుడే వైధవ్యం వస్తుంది. అది అనుభవనీయం." అంతే. అలాగే మానవుడు తనకు ప్రకృతి అందిచ్చేశక్తులను బూడిదపాలుచేస్తున్నాడు.

ఇన్నీ విమలకు నిరాశను కలిగించాయి. ఐతే మరొక సమస్య. తను ఇంట్లోంచి పారిపోతే అమ్మకీ నాన్నకీ అపవాదు రాదూ? వస్తే ఏం? వాళ్ళ అపవాదుకోసం సుఖాన్ని విడిచి క్రొవ్వొత్తిలా కాలడం ఎందుకు? జీవితం సుఖించి జీవించడానికే! అపవాదులేమీ అన్నానికి అడ్డురానివి. మరొక సమస్య. తను ఇక్కడనుంచి ఎక్కడికి పోవడం?

చిన్నప్పుడు తనకిస్తానన్న మేనమామ కొడుకు వున్నాడుగా దూరంగా పట్టణంలో? మరి అతడు వివాహితుడే?...ఐతే మాత్రం నువ్వాతన్ని కౌగలించుకో నవసరంలేదు. నీమీద ఏ మాత్రం సానుభూతియైనా అతనికి వుంటే నువ్వు నీ కాళ్ళమీద నిలబడగల్గేటట్లు చేయగలడు. నీ అంత నువ్వు సంపాదించుకుని తిని బ్రతకగలిగే శక్తి వచ్చేసరికి నీ చుట్టూ నూరు పురుష ముఖాలు తాండవంచేస్తాయి. ఆనాడు నువ్వెవ్వరినీ లెక్కచేయనక్కర్లేదు. నీ ఇష్టమైన పువ్వుని ఆఘ్రాణించవచ్చు. ఆనాడు నీకు తోడ్పడిన బావకి కృతజ్ఞత చూపవచ్చు. మరి అతని భార్య అంగీకరిస్తుందా?...ఆ శక్తి కూడా నీలోనే వుంది. బావని ఆకర్షించి నీవానిగా చేసుకుని ఆమెకు అన్యాయం చేయాలనే తలంపు నీలో లేనట్లు సంచరించే మెళకువ నీలో వుండాలి. తోటి సోదరి అని గుర్తుంచుకుంటే మహిళలు ఎన్నడూ లోకానికి అపచారం చేయలేరు......

బాగుందీ యోచన అనుకున్న విమలకు మరొక సంశయం కలిగింది. బావ సమ్మతినో. అసమ్మతినో తెలుసుకోవడం ఎలాగ? ఉత్తరం వ్రాస్తే సమాధానం ఎక్కడికి వస్తుంది?...అన్నట్లు పోస్టుమేస్టారు కూతురే నీకు స్నేహితురాలు కదూ? ఆమె అడ్రసు ఇయ్యి. పోస్టుమేస్టారు తన అల్లుడిదగ్గరనుంచి వచ్చిందనుకొని భద్రంగా కూతురికి అందిస్తాడు.

ఇలా అనుకున్న ఐదు రోజులకే బావ నుంచి ఉత్తరాన్ని విమల అందుకుంది. "విమలా! నీకుకలిగిన దుస్థితికి నేనూ మీ చెల్లీకూడా విచారిస్తున్నాం. పల్లెలోపడి వున్న నీలాంటివారే నిజమైన అనాథలు. వారికి తోడ్పడాలని నాకు పూర్తిగా తెలుసు. నువ్వు చేసేపని చాలాచక్కనిది. ఇక్కడ రెండు సంవత్సరాలలోగా నువ్వు ఉచితంగా విద్యను అందుకుని నీ జీవితమార్గాన్ని ఎన్నుకోగలవు. అందుకు నేను నీకు చేయగలిగిన సహాయాన్ని చేస్తాను. నీలాంటి అనాథలు తమంత తాము ఏదో విముక్తిపంథాను ఎన్నుకోవాలే కాని ఛాందస తలిదండ్రులపై భయంతో అన

వసరంగా భారతి కర్పూరమైపోవడం మంచిదికాదు. నీ ధైర్యానికి నేనూ మీ చెల్లీ మెచ్చుకుంటున్నాం. ఇందుతో పంపిన పది రూపాయల నోటుతో నువ్వు పట్నం వచ్చేయి. నాదగ్గరకు వచ్చినట్లు తెలిసాక నిన్ను నీ తలిదండ్రులు దండిస్తారని లొంగిపోతారనీ భయపడకు. అంతరంగికంగా నీ సుఖం కోరని వాళ్లు కాదు వాళ్ళు. తమంత తాము చేస్తే నెత్తిన నేరంపడి అపవాదులు ఎదురౌతాయని ఊరుకునే వ్యక్తులే నీ తలిదండ్రులు. మరొకరిపై నేరం పెడితే సంతృప్తులు. ధన్యులు అయే ప్రజానీకం నశించేవరకూ ప్రపంచం బాగుపడదు. అందుచేత నిర్భయంగా రైలు ఎక్కు. కావలిస్తే నీవు అమ్మవారిగుడి దాటాక నీ స్నేహితురాలినే నీ గమ్యస్థానాన్ని అమ్మా నాన్నకీ తెలియజేయమను. మీ చెల్లెలుకూడా నిన్ను రమ్మనమని పదేపదే వ్రాయమంటోంది.''

ఉత్తరం చదివిన విమలకు వెర్రెత్తింది, ఎదురుగా వున్న పోస్టుమేష్టారి కూతుర్ని ఖూనీ చేసేటంతగా ఒళ్ళంతా కౌగలింతలతో నింపింది. ఆమె కూడా చదివి విమలను అభినందించింది.

పట్నంలో విమల తిరిగి అద్దంవద్ద కూచుంది. ఈ సారి తన నుదిటపై కుంకం, చేతిలో గాజులూ, తలలో పూలు ఉన్నాయి. అంతేకాదు దొంగ చాటుగా వెనుకనుంచి వచ్చి తన పూలను అఘ్రాణించే జీవితాంత సహచారికూడా వున్నాడు. వీరిద్దరూ విమల బావకీ, చెల్లికీ కృతజ్ఞతా సూచకంగా తన కూతురకు భారతి అని పేరు పెట్టుకున్నారు.


ఏడాదికి ఒకేఒక్క ప్రత్యేక సంచిక
దానికోసం పాఠకులు ఎదురుచూస్తారు.

చిత్రాంగి డిశెంబర్ ప్రత్యేక సంచిక

కాలం తారుమారు ఔతున్నా ఉడతాభక్తి యన్నట్లుగా యీ సంవత్సరం కూడా చిత్రాంగి ప్రత్యేక సంచిక 20-12-47 నాటికి సర్వాంగసుందరంగా వెలువడుతుంది.

అనేక ఉత్తమ రచనలు—వ్యంగ్య రచనలు, వ్యంగ్య చిత్రాలు, రకరకాల బొమ్మలు, మంచి కథలు యీ సంచికలో వుంటాయి.

ప్రత్యేక సంచిక వెల 0-8-0

విడిప్రతులు కావలసినవారు ముందుగా 12 అణాల పోష్టుబిళ్ళలు పంపితే, రిజిష్టర్డు బుక్ పోష్టుద్వారా అందజేస్తాము. ఏజంట్లు 15-11-47 లోపుగా ప్రతుల వెలతోసహా ఆర్డరు పంపవలసి వుంటుంది. ఇది ముఖ్యం.

ప్రత్యేకసంచికకు విశేషప్రచారమని వేరే వ్రాయనవసరంలేదు. ప్రకటనలు చేయగోరువారికి యిది మంచి తరుణము. వివరములకు కార్యాలయానికి వ్రాయవచ్చును.

చిత్రాంగి, ఆండర్సన్ వీధి, జి. టి., మద్రాస్.


Edited and Published by A. N. Raghavachar, No. 32, Krishnappa Naick Tank St. G. T. Madras.
Printed by V. Kuppuswamy Chetty at Bharatamata press, 39, Anderson Street, G. T. Madras.